క్లుప్తంగా

పౌరహక్కుల దినోత్సవం



ఏటూరునాగారం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిప్యూటీ తహసీల్దార్ నితీష్‌కుమార్, ఎస్సై సుబ్బరాజు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండులోని ప్రయాణికులను సమవేశపరిచి సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శంకర్, ఆర్టీసీ కంట్రోలర్లు చిట్టిబాబు, చల్లా శ్రీనివాస్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి



కన్నాయిగూడెం: మండలంలోని వర్కింగ్ జర్నలిస్టులు సమస్యలు పరిష్కరించి, సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మండలానికి వచ్చిన కలెక్టర్‌కు ఎంపీడీఓ కార్యాలయం వద్ద జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో వర్కింగ్ జర్నలిస్టులు దుర్గం రాజు, పూజారి సుధాకర్, మల్లేష్, శ్యామ్, ఎండీ. షయక్, మహేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. 163 నంబర్ జాతీయ రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అనుమానితులు, కొత్త వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



వెంకటాపురం(కె): బహుజన సమాజ్ వాది పార్టీ మీద బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం సిద్ధార్థ పూలే అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సూర్యాపేటలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం బీఎస్పీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాటి దనాకర్, వెంకటేష్, చెన్నం రవి, కిరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు అందించడం సరికాదు



ములుగు రూరల్ : గత 16 రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాటు షోకాజ్ నోటీసులు అందించడం సరికాదని ఏఎస్‌ఎంలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట సమ్మెను కొనసాగించారు. అనంతరం ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, సీఐ మేకల రంజిత్ ఎస్సై లక్ష్మారెడ్డికి రాఖీ కట్టి తమ విన్నపాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, పాయం సరోజన, కోరీ సుజాత, వజ్ర, సూర్యకాంతం రజిత ,వెంకటమ్మ, వెంకటలక్ష్మీ, వరలక్ష్మీ , వెంకటరమణ, సులోచన, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

మహాముత్తారం : ఇటీవల నూతన తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నగునూరి శ్రీనివాస్‌ను బుధవారం తహసీల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్, సింగిల్‌విండో డైరెక్టర్లు అల్లాఉద్దీన్, తూటి భాస్కర్‌రెడ్డి, రేగులగూడెం సర్పంచ్ భూసి దేవేందర్‌రెడ్డి, గంట కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్యసేవలపై నిర్లక్ష్యం తగదు

- ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్



అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న క్రాంతికుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి : రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొడిశాల పీహెచ్‌సీని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది అటెండెన్స్, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించారు. జ్వరాలపై ఆరా తీశారు. ఎన్ని కేసులు వస్తున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మంగళవారం అనుమతి లేకుండా విధులకు హాజరు కానీ సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలందించాలని సూచించారు. విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలో డెలివరీ కేసులు సంఖ్యను పెంచాలన్నారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అయితే శాఖ పరమైన చర్యలకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ తెలిపారు.

విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి



ఏఎంఓకు వినతిపత్రం అందిస్తున్న ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ బోడ రాజు

ములుగు : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ బోడ రాజు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయంలో ఏఎంఓ బద్దం సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జిల్లాలో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు అర్హతలేని అధ్యాపకులను నియమించుకుని బోధన చేయిస్తున్నారని ఆరోపించారు. ఫైర్ సెఫ్టీ లేకుండా పాఠశాలలను నడుపుతున్నారన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులలో విద్యార్థులను తరలించడం నేరం అని తెలిసినా విద్యాసంస్థలకు ఉన్నతాధికారులు ఎందుకు సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కో కన్వీనర్ మారెపల్లి నవీన్, టౌన్ కన్వీనర్ రామగిరి రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ సభను విజయవంతం చేయండి

మంగపేట: ఆదివాసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న మంగపేటలో నిర్వహించనున్న ఆదివాసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని సంఘం నాయకురాలు పాయం అనిత బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 5వ షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ మహిళలు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ఆదివాసీ మహిళలు అభివృద్ధి కావాలంటే పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. మహిళలు చైతన్యవంతులై పోరాటం ద్వారా డిమాండ్లను సాధించుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు మహిళలను చిన్నచూపు చూస్తు వారి సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఏజెన్సీల్లో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఐటీడీఏలో మహిళా సమాఖ్య శాఖను తొలిగించడం మహిళల అభివృద్ధిని నిర్వీర్యం చేయడమే అన్నారు. పోడు భూముల హక్కుపత్రాల మంజూరీలో మహిళలకు అన్యాయం జరిగిందన్నారు. రీ సర్వే చేపట్టి పెండింగ్‌లో ఉన్న సాగుభూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో రాఖీ పండుగ సంబురాలు



మంగపేట : పాఠశాల విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



వెంకటాపురం(ఎం) : బాలుడికి రాఖీ కడుతున్న ముస్లిం చిన్నారి

మంగపేట: స్థానిక శ్రీ వైష్ణవి ప్రైవేటు పాఠశాలల్లో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాఖీ పండుగ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ రావుల రాజేశ్వర్‌రావు వివరించారు. విద్యార్థులు రాఖీలను అద్భుతంగా తయారు చేసి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. అనంతరం విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జోహార్ పాఠశాలలో..

వెంకటాపురం(ఎం): స్థానిక జోహార్ పాఠశాలలో బుధవారం రాఖీ వేడుకలను పిల్లలు నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జాహీద్ ఆధ్వర్యంలో ముస్లిం బాలికలు హిందు సోదరులకు, హిందు బాలికలు ముస్లిం సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



వెంకటాపురం(ఎం): మండలంలోని మీసేవ నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజా మొయినొద్దీకు మీసేవ నిర్వాహకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్‌కార్డులను అందించాలన్నారు. వార్షిక ఎఎంసీ పేమెంట్‌ను రద్దు చేయాలని, మీసేవ స్టేషనరీని ఉచితంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో భూక్య భద్రునాయక్, మాదాసు రంజిత్ కుమార్, తడుక వేణుగోపాల్, మార్క రాజు, ప్రసాద్, నరేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత



బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంగపేట: మండలంలోని కమలాపురం గోదావరి రోడ్డు ప్రాంతానికి చెందిన బండారి రాజు ఇటీవల మృతి చెందగా ములుగు ఎమ్మెల్యే ధనసరి అనసూర్య (సీతక్క) ఆదేశాల మేరకు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం బుధవారం అందచేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, నాయకులు భగవాన్‌రెడ్డి, సిద్దాబత్తుల జగదీష్, కోలా శివ, గూడూరు రంజిత్, పల్లె పురుషోత్తం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



ములుగు రూరల్ : ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ తనయుడు డాక్టర్ ప్రహ్లాద్ అన్నారు. మండలంలోని రామచంద్రపురంలో తన అనుచర కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్దతుదారుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈసందర్భంగా ప్రహ్లాద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తరపున టికెట్ ఆశించినప్పటికి పార్టీ అధిష్టానం కేటాయించలేదని అయినప్పటికీ ప్రజాక్షేత్రంలో పోటి దారుడిగా ఉంటానని అన్నారు. కార్యకర్తలు ప్రహ్లాద్‌కు టికెట్ కేటాయించకోకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తుడుందెబ్బ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించలేక మధ్యలోనే చదువులను మానేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కళాశాలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో ఐటీడీఏ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. సోమరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..ముగ్గురికి గాయాలు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద 163 నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. మండల పరిధిలోని చింతూరుకు చెందిన సెగ్గెం శ్రీనివాస్, కత్తెర అరవింద్ వాజేడు వైపు నుంచి చెరుకూరు వైపునకు వెళ్తున్నారు. చెరుకూరు నుంచి సీఆర్పీ కోరం శ్రీనివాస్ వాజేడు వైపునకు వస్తున్నాడు. మూల మలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ముగ్గురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఏటూరునాగార ఆస్పత్రికి తరలించారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



వెలిశాలలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల : ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో మేము సైతంలో భాగంగా సర్పంచ్ నల్లబెల్లి రమారవీందర్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే సులభంగా గుర్తించవచ్చని అన్నారు. గ్రామంలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేరరహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఏనుగు లచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణాలు అందిస్తాం

మహాముత్తారం: రుణమాఫీ అయిన రైతులందకీ మళ్లీ రుణాలు అందజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ అన్నారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ సంఘ సభ్యుల్లో అర్హులైన రైతులకు రుణాలు అందజేస్తామని అన్నారు. అదేవిధంగా సంఘం అభివృద్ధికి పాటుపడాలని డైరెక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెలమరెడ్డి అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు రాజయ్య, సమ్మక్క, పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ హనుమానాయక్

మల్హర్: ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించాలని మంథని ఆర్డీఓ హనుమానాయక్ సూచించారు. మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి, ఓటరు జాబితాను పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2, 3 తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు శిబిరాల నిర్వహణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హులంతా ఓటరు నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మృతి చెందిన ఓటర్ల గుర్తింపు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి డెత్ సర్టిఫికెట్ నిర్ధారణ చేసుకొని జాబితా నుంచి తొలగించాలని బీఎల్ఓలను ఆదేశించారు. తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ సరిత, బీఎల్ఓలు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



టేకుమట్ల: బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందిస్తున్న గండ్ర గౌతమ్‌రెడ్డి



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న విద్యుత్ అధికారులు

టేకుమట్ల(గోరికొత్తపల్లి): గోరికొత్తపల్లి మండలంలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన మాచపాక లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు గండ్ర గౌతమ్‌రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన దుప్పటి సరోజన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వచ్చిన సీఎంఆర్ఎఫ్ రూ.24వేల చెక్కును బాధితురాలికి అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు, యువజన నాయకులు ఉన్నారు. అలాగే మండలంలోని రామకిష్టాపూర్(టి)కు చెందిన విద్యుత్ ఉద్యోగి బండెల రాజబాబు మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు కిందపడిపోగా తలకు గాయమై మృతి చెందాడు. బుధవారం విద్యుత్ ఉద్యోగుల సంఘం(ఐఎన్‌టీయూసీ–327) ఆయన కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. అందించిన వారిలో విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సదయ్య, కార్యదర్శి నిమ్మల మల్లేశం, అధికారులు శ్రీనివాస్, కనుకయ్య, శోభన్‌బాబు, రాజు, నవీన్, అశోక్, రాజేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను వెంటనే పర్మనెంట్ చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు కొటం రవీందర్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 3వ రోజుకు చేరుకుంది. వీరి దీక్షకు మద్దతుగా వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా, మండల కార్యాలయాల్లో వివిధ హోదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22,000పై గా కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 18 ఏళ్ల గా పనిచేస్తున్నట్లు తెలిపారు. అన్ని అర్హతలు ఉండి, పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికైన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, గట్ల శ్రీనివాస్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు సేవానాయక్, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణరెడ్డి సమ్మెకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు జయవసంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తోకల వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ చాంద్ పాషా, జాక్ సభ్యులు, ఎస్ఎస్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి రాఖీ కట్టిన విద్యార్థినులు



భూపాలపల్లి రూరల్: సమాజంలో సగభాగమైన మహిళలను పురుషులతో సమానంగా సమాన హక్కులు కల్పించిన మహానాయకుడు మహిళా లోకానికి రక్షకుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ అని ధర్మసమాజ్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ మందపల్లి హరీష్ అన్నారు. పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థినిలు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్ల దేశంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు సమాన హక్కులు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యార్థి విభాగం పట్టణ ప్రచారకులు మహర్షి అశోక్, దశరథం, రాజ్‌కుమార్, కిరణ్, విజయ్, దివ్య, మనిషా, రజిత, రమ్య పాల్గొన్నారు.

బీఎల్వోలకు కిట్ల పంపిణీ



కాటారం: తహసీల్ కార్యాలయంలో బుధవారం బీఎల్వోలకు తహసీల్దార్ నాగరాజు బీఎల్వో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన కిట్‌ను ఉపయోగించాలని సూచించారు. ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేయకుండా అధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు అమలు చేయాలని పేర్కొన్నారు. అలాగే ఓటర్లకు అవగాహన కల్పించి ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్వోలు శ్రీలత, రమ తదితరులు పాల్గొన్నారు.